క్లుప్తంగా

వైద్యశాలలో ఆశ డే



కన్నాయిగూడెం: మండల పరిధిలోని కన్నాయిగూడెం ప్రభుత్వ వైద్యశాలలో ఆశడే సందర్భంగా వైద్యాధికారి అభినవ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహ, బీపీఎంఓ సంజీవరావు, సిబ్బంది భాస్కర్‌రావు, ఊర్మిళ, లక్ష్మి, సబిత, కవిత తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ములుగు రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని అబ్బాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ వైపు నుంచి స్కూటీపై ప్రణిత ఆమె తల్లి శైలజ ములుగు వైపు వస్తున్నారు. రేగొండ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన రవి అబ్బాపూర్ నుంచి ములుగు వైపు జాతీయ రహదారిపైకి రాగానే ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కాటారం: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టి ఎలాంటి అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని గంగారం గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి నిధుల ఖర్చు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులు, పల్లె ప్రగతి పనులను పర్యావేక్షించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్‌కు సూచించారు.

నియామకం

మొగుళ్లపల్లి: భూపాలపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రచార కార్యదర్శిగా మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన మురహరి నిరంజన్‌ను ఏకగ్రీవంగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ.. జిల్లా కమిటీ ఆదేశాల మేరకు కుల సంఘాన్ని సామాజికంగా రాజకీయంగా వృత్తిపరంగా బలోపేతం చేస్తానని తెలిపారు.

టీషర్టుల పంపిణీ

కాటారం: కాటారం మండలం ధన్వాడలో నిర్వహిస్తున్న డీపీఎల్ 10 క్రికెట్ టోర్నీలో భాగంగా ధన్వాడ టీంకు కాంగ్రెస్ నాయకుడు భూపెల్లి రాజు మంగళవారం టీషర్టులు పంపిణీ చేశారు. పది సంవత్సరాలుగా భూపెల్లి రాజు టీం సభ్యులకు టీషర్టులు, క్రీడా సామగ్రి అందజేస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్వానంగా రోడ్లు



బురదమయంగా ఉన్న శివాపురం రోడ్డు



గుంతలమయంగా ఉన్న రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రం మేజర్ పంచాయతీ పరిధిలోని శివాపురం వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలమయం, బురదమయంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శివాపురం వీధిలో మట్టి రోడ్లు అన్ని భారీ వర్షాలకు కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్లపైనే మురుగు నీరు నిల్వ ఉంటోంది. ఈ రోడ్లపై నడిచేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా మారిందని వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల భారిన పడుతున్నామని ఆగ్రహం వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేయాలని కోరతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



శివాపురం బజారులో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. దీంతో మురుగు నీరు నిల్వ ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– నవీన్, గ్రామస్తుడు

మిషన్ భగీరథ నీరు కలుషితం



లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ నీరు

మంగపేట: మండల కేంద్రంలో మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు కలుషితం అవుతోంది. కోమటిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డు పక్కన మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్‌కు రెండు నెలల క్రితం లీకేజీ ఏర్పడింది. లీకేజీకి మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో లీకేజీ నీటితో పాటు వర్షపునీరు నిలిచి మురుగునీటి మడుగుగా తయారైంది. అందులో నుంచి వాహనాలు వెళ్లకుండా భారీకేడ్‌ను అడ్డు ఉంచి వదిలేశారు. రోజు రోజుకు లీకేజీ ఎక్కువై తాగునీరు వృథాగా పోతున్నాయి. అంతే కాకుండా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా అయ్యే సమయంలో లీకేజీ నీరు బయటకు రావడం, సరఫరా నిలిచిపోయిన సమయంలో గుంతలోని మురుగు నీరు పైప్‌లైన్‌లోకి వెళ్లడంతో తాగు నీరు కలుషితం అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇదే ప్రాంతంలో తరచుగా లీకేజీ ఏర్పడుతున్నా శాశ్వత మరమ్మతులు చేపట్టకుండా తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి వదిలేస్తున్నరని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమాచారం అందించండి

ములుగు రూరల్: దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజమణికన్ ప్రకాశ్ కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 2014లో నిందితుడు ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనానికి పాల్పడగా ములుగు కోర్టులో సెక్షన్ 395 ఐపీసీ కింద కేసు కొనసాగుతోందని అన్నారు. నిందితుడు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉందని తెలిపారు. తరదుపరి విచారణ 2026 జనవరి 20వ తేదీన ములుగు కోర్టులో నిందితుడు హాజరు కావాల్సి ఉందని అన్నారు. తెలిసిన వారు 87126 70082 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం

- పార్టీ మండల అధ్యక్షుడు నరసింహనాయక్



మాట్లాడుతున్న నరసింహనాయక్

గోవిందరావుపేట: స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీదే విజయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం లకావత్ నరసింహ నాయక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. ప్రతీ కార్యకర్త గ్రామ స్థాయిలో సమన్వయంతో పని చేయాలని తెలిపారు. సూడి శ్రీనివాస్ రెడ్డి, పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, రాంచందర్, స్వరూప, శ్రీనివాసరావు, చందులాల్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్, ఉపాధ్యాయులు

కాళేశ్వరం: వన్యప్రాణుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని గ్రీన్‌వారియర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ కాళేశ్వరంలో హెచ్‌ఎం బాసిరి అన్నపూర్ణ అధ్యక్షతన పిల్లలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా గ్రీన్ వారియర్ చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణ వాటి ఆవశ్యకతను వివరిస్తూ పర్యావరణ వ్యవస్థలో అత్యంత కీలక భాగాలైన గాలి శుద్ధీకరణ, నేలకోత నివారణ, వాతావరణ నియంత్రణలో వన్యప్రాణులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. వన్యప్రాణుల చర్మం, దంతాలు అవయవాల కోసం వన్యప్రాణులను హతమార్చటం చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. వన్యప్రాణులపై ప్రేమతో మెదలడం అలవాటు చేసుకోవాలన్నారు. అంతకుముందు మహదేవపూర్ మండల కేంద్రంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజేందర్, జ్యోతి, శ్రీధర్, రాజకుమార్, సమ్మయ్య, షహనాజ్ బేగం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రేగొండ: మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రసజ్ఞ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రవీందర్ రావు, ప్రసంగి ఉన్నారు.

కాళేశ్వరం: పలిమెల మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజీ తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో మహదేవపూర్‌లోని ఆయన ఇంట్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మహదేవపూర్ మండల కేంద్రంలోని షాహీన్, షాహిబ్‌ల తల్లి ఇటీవల మృతి చెందగా వారిని పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, గీతా, వెంకట్‌స్వామి, మధుతో పాట తదితరులు ఉన్నారు.

పోరాట యోధుడు కొమురం భీం



వెంకటాపురం(కె): కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కన్నాయిగూడెంలో..



ఎస్ఎస్ తాడ్వాయి: కొమురం భీం విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్ తాడ్వాయి: పోరాట యోధుడు కొమురం భీం పలువురు గిరిజన నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఆదివాసుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరుడు కొమురం భీం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడి ప్రాణాలర్పించిన భీం విగ్రహానికి సమ్మక్క పూజారి సిద్దబోయిన స్వామి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి గిరిజన నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమురం భీం ఆత్మ త్యాగం గిరిజన సమాజానికి ప్రేరణాస్ఫూర్తి అని అన్నారు. కొమురం భీం చూపిన మార్గంలోనే గిరిజన యువత సామాజిక సమానత్వం, హక్కుల సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇర్ప సునీల్, కొప్పుల రవి, వెంకటేష్, కోటేశ్వరరావు, సురేందర్, మహేష్, నరేష్, స్వామి, ఉదయ్, అజయ్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మండల కేంద్రంలో ఘనంగా కొమురం భీం వర్ధంతిని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీశ్ కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరం భీం ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, రమేష్, సుందర్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండ కేంద్రంలో ఆదివాసీ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా కొమురం భీం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఆదివాసీ పెద్దలు పాయం నాగేశ్వరావు, సపుల సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు సతీష్, రామచందర్ మాట్లాడుతూ.. దివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి జల్ జంగిల్ జమీన్ నినాదం సృష్టి కర్త కొమురం భీం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం హక్కుల కోసం పోరాటం చేయాలలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత సోమరాజు, సమ్మయ్య, చిరంజీవి, లక్ష్మి, మహేష్, రాంబాబు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సర్వేశ్వరావు

వాజేడు: కొమరం భీం వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోదెబోయిన సురేష్, ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లెబోయిన సర్వేశ్వరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మంగళవారం స్థానిక సంత బజారులో విలేకర్లతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని సంత బజారులో నేడు(బుధవారం) కొమరం భీమ్ వర్ధంతి సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ సంఘాల జిల్లా జేఏసీ చైర్మన్ దబ్బకట్ల సుమన్ ముఖ్య అతిథిగా హాజరు అవుతున్నట్లు తెలిపారు.

పశువుల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం



పట్టుబడిన వాహనంలో ఉన్న పశువులు

ములుగు రూరల్: పశువుల అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని జాకారం వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అతి వేగంగా వాహనం నిలుపకుండా వెళ్లిన వాహనాన్ని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. వాహనంలో ఆరు ఎద్దులను నిర్బంధించి తరలిస్తుండగా పట్టుబడిన పశువులను గోశాలకు తరలించారు. వాహనం నంబర్ ఏపీ 39 డబ్ల్యూజీ 5111 వాహనాన్ని సీజన్ చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన యజమాని గుంజి యోగానంద, డ్రైవర్ ఉల్లిగండ వీరాంజనేయులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన నీలం శంకర్ భూపాలపల్లి సంఘమిత్ర డీగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా గతంలో పనిచేశాడు. కాగా కొన్ని రోజుల క్రితం అతడికి పెరాలాసిస్ వచ్చి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో సంఘమిత్ర ట్రస్ట్ చైర్మన్ గుర్రపు రవీందర్ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ లెక్చరర్ శంకర్‌ను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. నరేందర్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసమే బీఆర్‌ఎస్ ఆరాటం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి

చిట్యాల: బీఆర్‌ఎస్ పార్టీ ఉనికి కోసం ఎంతో ఆరాట పడుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కా ధోకా కార్డు అనే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రతి ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మండల నాయకులు గడ్డం కొమురయ్య, కామిడి రత్నాకర్‌రెడ్డి, చిలుకల రాయకొమురు, దొడ్డి కిష్టయ్య, మూల శంకర్ గౌడ్, రవీందర్‌రెడ్డి, ఏకు రవీందర్, బుర్ర లక్ష్మన్ గౌడ్, గుర్రపు తిరుపతి గౌడ్, గుర్రం నర్సయ్య, ఆకుల అదిరెడ్డి, కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బాకీ ఉందని చెప్పడం సిగ్గుచేటు..

మొగుళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రాన్ని పది సంవత్సరాలుగా పాలించి రూ.లక్షల కోట్ల దోపిడి చేసి మళ్లీ ప్రజల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ బాకీ ఉందని మాయామాటలు చెప్పడం సిగ్గు చేటని చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గ్రామాల్లో తిరుగుతూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆకుతోట కుమారస్వామి, బండి సుదర్శన్, తక్కళపెల్లి రాజు, యార రవి, క్యాతరాజు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

టేకుమట్ల: మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని రామకిష్టాపూర్(టీ)లో బీఆర్‌ఎస్ ధోకా కార్డులను పంపిణీ చేశారు. నాయకులు పెరుమాండ్ల క్రాంతి, కొడగాని నవీన్, సంగి రవి, దొంతుల శ్రీనివాస్, బండ శ్రీకాంత్‌పాణి ఉన్నారు.

కెనాల్‌లో ముళ్లపొదలు



పొదలతో ఉన్న ఎస్సారెస్పీ డీబీఎం 16 కాల్వ



మాటు కాల్వ లేక మూతపడ్డ కల్వర్టు

- సంవత్సరాలుగా మరమ్మతుకు నోచుకోని కాల్వ
- చివరి ఆయకట్టు వరకు అందని సాగు నీరు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

టేకుమట్ల: ఎస్సారెస్పీ డీబీఎం 16 కాల్వ మండలంలోని ఆరెపల్లి నుంచి చివరి ఆయకట్టు అయిన కుందనపల్లి వరకు ఉంది. గత నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన కాల్వకు 1999లో సిమెంట్‌తో పునర్‌నిర్మించారు. అప్పటి నుంచి మండలంలోని ఆరెపల్లి, దుబ్యాల, కుందనపల్లి, గుమ్మడవెల్లి, బండపల్లి, వెల్లంపల్లి రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వానాకాలం, యాసంగి సీజన్‌లో పంటలను పండించుకుంటున్నారు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా కాల్వను పట్టించుకునే నాథుడే లేక ముళ్లపొదలతో నిండుకుని కాల్వ లేనట్లుగా దర్శనమిస్తూ, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


బూజునూరు నుంచి కుందనపల్లి వరకు..

ఎస్సారెస్పీ డీబీఎం 38 కాల్వ ప్రధాన కాలువ నుంచి కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని బూజునూరు మీదుగా ఎస్సారెస్పీ డీబీఎం 16 కాల్వ ప్రారంభమై మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి, కోమటిపల్లి, ఇప్పలపల్లి నుంచి టేకుమట్ల మండలంలోని ఆరెపల్లికి చేరుకుని అక్కడి నుంచి చివరి ఆయకట్ట అయిన మండలంలోని కుందనపల్లికి చేరుకుంటుంది. ఎస్సారెస్పీ డీబీఎం 16 కాల్వ ఆధారిత భూములు, చెరువులు సైతం ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువ మరమ్మతుకు నిధులు కేటాయిస్తే రైతుల పంటలకు సాగు నీటి సమస్యకు పూర్తి స్థాయి పరిష్కార మార్గం సుగమం అవుతుందని రైతులు తెలుపుతున్నారు.

సుమారు 200 ఎకరాల సాగు..

మండలంలోని పలు గ్రామాల రైతుల వ్యవసాయ భూములు సుమారు 200 ఎకరాల భూమి సాగులో ఉండగా కాల్వ మరమ్మతుకు ఇరిగేషన్ అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం నాలుగు కిలోమీటర్ల మేర కాల్వ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండి పోయింది. దీంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరందక పలు గ్రామాల రైతులు యాసంగిలో భూములను సాగు చేయకుండా వదిలేస్తున్నారు.


మరమ్మతులు చేపట్టాలి



ఆరెపల్లి శివారులో నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. కాల్వ కింద రెండెకరాల భూమి సాగు అవుతోంది. కొన్ని సంవత్సరాలుగా కాల్వలో పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోవడంతో నీళ్ల సరిగా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పూర్తి స్థాయిలో నీళ్ల రాక పంటలకు సరిగా నీళ్ల అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి కాల్వలో చెట్లను తొలగించాలి.

– గువ్వాడి లక్ష్మణ్, రైతు ఆరెపల్లి

మాటు కాల్వలు కబ్జా



ఎస్సారెస్పీ డీబీఎం 16 కాల్వ ఆధారిత భూములకు మాటు కాల్వల ద్వారా సాగు నీరందేది. కానీ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్ల మాటు కాల్వలు మాయమయ్యాయి. కాల్వల భూములను సైతం రైతులు కబ్జా చేసి కాల్వలు లేకుండా చేశారు. దీంతో చాలా చోట్ల కాల్వ నుంచి నీరు చేరక కాల్వ నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాటు కాలవ్యలను పునరుద్ధరించి సాగు నీరు అందించాలి.

– బట్టల మొగిలి, రైతు గుమ్మడవెల్లి

మరోసారి మర్చి నాటు



మిర్చి నారు నాటుతున్న కూలీలు

వాజేడు: గోదావరి వరద మూలంగా మిర్చి తోటలు మునిగి నష్టపోయిన బాధిత రైతులు తిరిగి మర్చి మొకకలు నాటడం ప్రారంభించారు. మండలంలో సుమారుగా 500 ఎకరాల మిర్చి పంట దెబ్బతింది. గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో రైతులు తిరిగి మొక్కలు నాటారు. రైతుల వద్ద మిర్చి నార్లు లేక పోవడంతో మిర్చి నార్లను కొనుగోలు చేసి మిర్చి మొక్కలను నాటు తున్నారు.